ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



శాంతి ర్యాలీలో వీహెచ్, బొల్లు కిషన్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీ వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ అండంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు రామ్మోహన్‌రావు, ధన్‌రాజ్‌యాదవ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

చిక్కడపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మృతి చెందిన 26 మందికి గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ మతం పేరిట మారణహోమం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వందేభారత్ సినిమా నిర్మాత మల్లం రమేష్, ప్రముఖ గాయకులు త్రినాథరావు, రామసుబ్రహ్మణ్యం, రవిమన్యు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మోహన్‌గాంధీ పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

నల్లకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల జరిపిన కాల్పుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తూ నల్లకుంట డివిజన్ రత్నానగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ యాకర అమృత మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్, నిర్వాహకులు ఆర్.నర్సింగ్‌రావు, వినోద్‌యాదవ్, పోచాలు ప్రసాద్, రవి, సతీష్, పాతకోటి మహేష్, ఈశ్వర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ జాతీయ జెండా దహనం

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం చౌరస్తాలో పాకిస్థాన్ జాతీయ జెండాను బజరంగ్ సేన దహనం చేసింది. కార్యక్రమంలో బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఠాకూర్ వికాస్‌సింగ్, జయరాజ్‌యాదవ్, గులాబ్ శ్రీను, ప్రవీణ్ యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల ఆత్మకు శాంతి చేకూరాలి

కవాడిగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ వి. పరశురాం డిమాండ్ చేశారు. శుక్రవారం దోమలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశంలో చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు.



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి తదితరులు



ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అమృత తదితరులు



పాకిస్థాన్ జాతీయ జెండాను దహనం చేస్తున్న బజరంగ్‌సేన నాయకులు

దివ్యాంగుల చట్టాల అమలుపై
29న సదస్సు

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో ఈనెల 29న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దివ్యాంగుల చట్టాల అమలు-అనుభవాలు అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని వేదిక ప్రధానకార్యదర్శి ఎం. అడివయ్య తెలిపారు.



మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'మలేరియా'పై అవగాహన

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముషీరాబాద్, భోలక్‌పూర్, బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా ఆస్పత్రుల పీహెచ్‌ఎన్‌లు వనతి, ఫెల్సిస్, కళావతి మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ల ఏఎస్‌ఎంలు లక్ష్మీబాయి, విజయకుమారి, సునీత, రత్నమాల, అనురాధ, సంతోషిణి, శీలా, లత, యాదమ్మ, మలేరియా శాఖ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ

విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ పై ఆసక్తి పెంచుకోవాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని హైదరాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో తైక్వాండో సాయిరక్ష అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్, బ్లాక్‌బెల్ట్ సాధించిన 50 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో సాయిరక్ష అధ్యక్షుడు సాయి, సీనియర్ కోచ్‌లు లక్ష్మీనారాయణ, రాకేష్ కుమార్, మణీష్, జెయందర్, వైష్ణవ్, సాకేత్, అభిజిత్, ధనుష్, క్రితిక్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదు



ఉదయ్‌కృష్ణారెడ్డిని అభినందిస్తున్న ఆర్‌సీరెడ్డి, సంఘమిత్ర

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని సివిల్స్ ఆలిండియా 350 ర్యాంకర్ ఉదయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఉదయ్‌కృష్ణారెడ్డిని శుక్రవారం అశోక్‌నగర్‌లోని ఆర్‌సీరెడ్డి ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో సంస్థ డైరెక్టర్ ఆర్‌సీ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలని సివిల్ సర్వీస్‌ను ఎంచుకున్నానన్నారు. నిరంతర శ్రమతో ర్యాంక్ సాధించానని తెలిపాడు.

వంగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌దీప్ తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి తమ గొండ రాజ్‌దీప్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్‌శాఖ ఏఈని నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ఒకవైపు వంగిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జీఎన్ చారి, సీనియర్ నాయకుడు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజి రాజమౌళి గుప్తాకు సతీవియోగం



అమృతమ్మ (ఫైల్)

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా భార్య అమృతమ్మ (82) శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. వివిధ జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ గంజి రాజమౌళిగుప్తాకు ఫోన్‌లో ధైర్యం చెప్పారు. అమృతమ్మ అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించారు.

అంబేడ్కర్‌ను అవమానించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న డాక్టర్ కె. లక్ష్మణ్

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను కాంగ్రెస్ నేతలు అవమానిస్తే.. ఆయన ఆశయాలు, లక్ష్యాలను అమలు చేస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కిందని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హమారా సంవిధాన్, హమార స్వాభిమాన్ పేరుతో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్ హెరిటేజ్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా ఉందంటే అంబేడ్కర్ దూరదృష్టితో రచించిన రాజ్యాంగ ఫలితమేనని అన్నారు. అంబేడ్కర్ హిందూ కోడ్‌ను, 370 ఆర్టికల్‌ను వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఆయనకు భారతరత్న అవార్డును ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారని, కనీసం పార్లమెంట్‌లో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టేందుకు అంగీకరించలేదన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి ప్రోత్సాహంతో పార్లమెంట్‌లో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి అంబేడ్కర్‌పై ప్రేమలేదని కేవలం ఓట్ల కోసమే రాజ్యాంగ పుస్తకాన్ని చేతబట్టి దళితులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. వాస్తవ విషయాలపై చర్చ జరగాలని దేశవ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని లక్ష్మణ్ తెలిపారు.

సదస్సులో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్‌లు పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, సుప్రియా నవీన్‌గౌడ్, బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, నాయకులు సదానంద్ ముదిరాజ్, వెంకటరమణి, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు దండి కృష్ణమాదిగ, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

హాస్టల్ వర్కర్స్‌కు జీతాలు చెల్లించాలి

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాలేజీ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్స్‌కు 10 నెలలుగా జీతాలు రావడం లేదని, వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. వారికి వెంటనే జీతాలు చెల్లించకపోతే కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ వర్కర్స్‌కు రూ. 15 వేల నుంచి 25 వేలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతీరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పని విధానం అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి, వర్కర్స్‌కు జీతాలు వారి బ్యాంక్ ఖాతాలో జమచేయాలన్నారు. ప్రతీ హాస్టల్‌కు నలుగురు శాశ్వత వర్కర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

సంచార పాఠశాలల ఏర్పాటుతో
గ్రామాల్లో అక్షరాస్యత పెంపు

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ అన్ని వర్గాల ప్రజలపై ఆధారపడి ఉందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విద్యా సంస్థలో వికసిత్ భారత్ - 2047 అనే అంశంపై సదస్సు జరిగింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం, డాక్టర్ పి.నర్సయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌గౌడ్, ప్రొఫెసర్ శ్రీనివాస్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తమ్, అంబేడ్కర్ విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ పీవీ రమణకుమార్, డైరెక్టర్ వై.విష్ణుప్రియ, కళాశాల ప్రిన్సిపాల్ మట్ట శేఖర్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ మధుకర్, నవ్య, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సంచార పాఠశాలల ఏర్పాటు ద్వారా గ్రామాలలో అక్షరాస్యత పెంచవచ్చన్నారు.

28న సాంస్కృతికరంగ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రసమయి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం త్యాగరాయగానసభలో సాంస్కృతికరంగ పురస్కారాల ప్రదానసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు డా. ఎం కె రాము తెలిపారు. సాంస్కృతిక రంగానికి తమవంతు బాధ్యతగా సేవలందిస్తున్న ప్రతిభావంతులకు ఈ సందర్భంగా సత్కారం జరుగుతుందన్నారు. వేంకటేశ్వరయూనివర్శిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని వివరించారు.

దళితులను గ్రామం నుంచి బహిష్కరించిన వారిపై
అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నల్లకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిఠాపురంలో జరిగిన కుల వివక్ష, గ్రామ బహిష్కరణపై న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించామని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర నాయకుడు రాజేష్ తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడలో విలేకరులతో వారు మాట్లాడారు. మల్లం గ్రామంలో దళితులను గ్రామం నుంచి బహిష్కరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా హైదరాబాద్ సిటీ-1, ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. ఛే నంబర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు, ఏపీ టూరిజం, అంబేడ్కర్ నగర్, హైదర్‌గూడ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, తిలక్‌నగర్, గోల్నాక పరిధిలో ఉదయం 8.30నుంచి 10 గంటల వరకు, సిటీసెంట్రల్ లైబ్రరీ, ఆదర్శనగర్ పరిధిలో ఉదయం 9 నుంచి 10గంటల వరకు, బౌద్ధనగర్, బసంత్ కాలనీ పరిధిలో ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు, గుల్షన్‌నగర్, గగన్ మహల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

వివేకానంద డిగ్రీ కళాశాలలో న్యాక్ కార్యశాల

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో రివైజ్డ్ న్యాక్ అక్రిడిటేషన్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై కార్యశాల జరిగింది. నూతనంగా వచ్చిన మార్పులు, విద్యా విధానం, న్యాక్ క్రైటీరియల్, కళాశాలలో రీసెర్చ్, పబ్లికేషన్ అంశంపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు, ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్ ఈశ్వర్, డాక్టర్ పి.పద్మజ, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ అనురాధ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ఆర్య వైశ్య భవన్‌లో సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రజతోత్సవ సభ సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో గులాబి జెండాలు ఎగరవేయాలని సూచించారు. ప్రతి డివిజన్‌కు 10 బస్సులు కేటాయిస్తామని, సభకు 5వేల మందికి పైగా పార్టీ శ్రేణులు ర్యాలీగా తరలిరావాలని సూచించారు. పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలను సభకు తరలించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, పెంటారెడ్డి, రెబ్బ రామారావు, ముఠా జైసింహ, ఆరు డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్ కుమార్, శంకర్‌ముదిరాజ్, వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా సతీమణి అమృతమ్మ మృతిపట్ల ఎమ్మెల్యే, నాయకులు నివాళులర్పించారు.

చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా వరంగల్ సభ

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడానికి వరంగల్ సభ నాంది పలుకుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందన్నారు. ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని అన్నారు. చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా వరంగల్ సభ ఉంటుందన్నారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కేసీఆర్‌కు మద్దతు ఇవ్వాలని ముఠా గోపాల్ కోరారు.



ముషీరాబాద్‌లో గోడపై రాస్తున్న ముఠా జైసింహ

భారీ జనసమీకరణకు సన్నాహాలు

రాంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన తనయుడు జైసింహ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డివిజన్ల వారిగా కో-ఆర్డినేషన్ కమిటీలు, ప్రచార కమిటీలను ఏర్పాటు చేసి భారీ జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. వరంగల్ బహిరంగ సభకు హాజరయ్యే బీఆర్‌ఎస్ కార్యకర్తలు గులాబీ చొక్కా ధరించి రావాలని ఎమ్మెల్యే సూచించారు.

'ఉద్యోగ భద్రత కల్పించండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలిపారు. నాలుగో రోజు సమ్మెకు ప్రొఫెసర్ చింతాబట్ల శ్రీనివాస్, టీఎన్‌ఎన్ అధినేత పృథ్వీరాజ్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశర్లు యాదవ్, నాయకులు రుద్రవరం లింగస్వామి, గాదే వెంకట్, డప్పు వెంకట్, రాజేష్, ఉదయ్, ప్రజాపతి సత్యనారాయణ, సురేష్, దర్శనం జాన్ తదితరులు మద్దతు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఓయూలో ఫౌండేషన్ డే వాక్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ 108వ ఆవిర్భావ దినోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 26న జరగనున్న ఆవిర్భావ వేడుకలకు ప్రారంభ సూచికగా ఫౌండేషన్ డే వాక్‌ను వీసీ ప్రొఫెసర్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు రెండు కిలోమీటర్ల మేర జరిగిన వాక్‌లో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఆవిర్భావ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓయూ సాధించిన విజయాలను వివరించారు. ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఉగ్రదాడిని ఖండించారు.



ఫౌండేషన్ డే వాక్‌లో ఓయూ వీసీ కుమార్ తదితరులు



రేవణాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణదాసు, సురేంద్రరాజు తదితరులు

సాహిత్యంతో పాలకుల దుర్మార్గాలను ఎండగట్టాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అండగా కవులు, కళాకారులు, రచయితలు నిలవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాహిత్యంతో పాలకుల దుర్మార్గాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కవి విశ్వనాథుల పుష్పగిరి రచించిన రేవణాలు పుస్తకాన్ని ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ అంబటి సురేంద్రరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల అప్రజాస్వామిక చర్యలను కవులు, రచయితలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. 16 నెలల ప్రభుత్వ పాలనలో జరిగిన ప్రజావ్యతిరేక విధానాలను 16 కవితల రూపంలో తీసుకురావడం వినూత్న ప్రక్రియ అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫార్మాసిటీ బాధిత రైతు, కవి నారాయణదాసు మాట్లాడుతూ తమ బాధలను కవిత్వ రూపంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వంపై తిరుగుబాటు కవిత్వం రాసిన పుష్పగిరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కవులు, రచయితలు మోహన్ బైరాగి, ఇంద్రపాల శ్రీనివాస్, నరేష్‌కుమార్‌సూఫి, రాచకొండ రమేష్, ఎం.ఎస్. నాయుడు, కనకాచారి, జంపాల ప్రవీణ్, వాణి, కార్తీక్ పాల్గొన్నారు.

'ఓదేల - 2'లో అభ్యంతరకర సన్నివేశాలను తొలగించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'ఓదేల-2' సినిమాలో వంశరాజ్ కులస్థులను అవమానించే సన్నివేశాలను తొలగించాలని నవోదయ పార్టీ అధ్యక్షుడు జి.శివశంకర్ పటేల్ డిమాండ్ చేశారు.

శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ కార్మిక విభాగం నేత మల్లేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంశరాజ్ కులస్థులను అవమానించేలా సంబోధిస్తూ సన్నివేశాలు రూపొందించారని, దీనివల్ల వంశరాజ్ కులస్థులు అవమానానికి గురవుతున్నారని అన్నారు. సినిమా డైరెక్టర్ అశోక్‌తేజ, నిర్మాత మధుపై తక్షణమే పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శివశంకర్‌పటేల్